క్లుప్తంగా

ఎద్దులపల్లిలో డ్రైనేజీ అస్తవ్యస్తం



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగును చూపుతున్న గ్రామస్తులు

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి గ్రామంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారింది. మురుగు రోడ్డుపై ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వర్షం వస్తే గత్యంతరం లేక ఈ మురుగు నీటిలోనే గ్రామస్తులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మురునీటి నిల్వలు దోమలకు ఆవాసంగా మారాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణం స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యాకానుక కిట్లు పంపిణీ చేయాలి

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాకానుక కిట్లను వెంటనే పంపిణీ చేయాలని రాష్ట్రీయ మానవాధికార్ సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ మాలిక్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఇప్పటికీ కొన్ని పాఠశాలల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, తదితర సామగ్రిని ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రత్యక్షంగా కనిపిస్తోందని విమర్శించారు. ప్రైవేట్ స్కూళ్లల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెద్దవడుగూరు: మండల పరిధిలోని మిడుతూరు సమీపంలోని న్యూ అమోఘ్ వద్ద సుమారు 30 నుంచి 40 ఏళ్ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి గత నెల 16వ తేదీన రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడ్ని చికిత్స కోసం అనంతపురం తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు యాడికి రూరల్ సర్కిల్ సీఐ 9491308871, ఎస్ఐ 9440796826 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని ఆందోళన



విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

గుత్తి: గ్రామంలో విద్యుత్ సమస్య పరిష్కరించాలని బేతాపల్లి గ్రామస్తులు డిమాండ్ చేశారు. బుధవారం గుత్తిలోని ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయం వద్ద బేతాపల్లి గ్రామంలోని వంకాయల వీధికి చెందిన పలువురు ఆందోళన చేపట్టారు. నరేష్, శివ, రామకృష్ణ, శ్రీనివాసులు, విజయ్ తదితరులు మాట్లాడుతూ.. వంకాయల వీధిలో విద్యుత్ సమస్య ఉందన్నారు. నీటి మోటర్లు ఆన్ చేస్తే ఫీజులు ఎగిరిపోతాయన్నారు. ఈ విషయాన్ని పలుసార్లు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏడీఈ సాయి శంకర్‌కు వినతి పత్రం అందజేశారు.

పరామర్శ



శివ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వీరాంజనేయులు

గార్లదిన్నె: మండల పరిధిలోని కేశవాపురానికి చెందిన శివ (27) అనే విద్యార్థి మంగళవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. కల్లూరులో 44వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆటోను అనంతపురము వైపు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే టమాట లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న శివ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వీరాంజనేయులు బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. శివ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆడపిల్లే ఇంటికి వెలుగు

- ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



కసాపురంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: ఆడపిల్లే ఇంటికి వెలుగని తాడిపత్రి ఐసీడీఎస్ సీడీపీఓ సాజితా బేగం పేర్కొన్నారు. బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నారాపురం, చాగల్లు, సోమనపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో ఆడపిల్లల శాతం తక్కువగా ఉందన్నారు. ఎక్కువ మంది మగపిల్లలే కావాలని కోరుకుంటున్నారన్నారు. ప్రస్తుతం సగటున 1000 మందికి 937 మంది ఆడపిల్లలు మాత్రమే ఉన్నారన్నారు. పిల్లలకు పోతపాలు పట్టవద్దని.. తల్లిపాలే శ్రేయస్కరమని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ

గార్లదిన్నె: తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తల్లిపాలు అత్యంత శ్రేష్ఠ మైనవి అన్నారు.బిడ్డపుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు తాపించాలన్నారు. తల్లిపాలలో రోగనిరోధక శక్తి పెంచే ఔషధ గుణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పారా మెడికల్ సిబ్బంది శివయ్య, నాగప్రతిభ, ఎమ్ఎల్‌హెచ్‌పీ నాగేశ్వరి పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: వారం రోజుల పాటు ప్రతి గ్రామంలో పండుగలా నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు బుధవారం ముగిశాయి. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి ముఖ్య అతిథిగా హాజరై తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే ప్రయోజనాలను వివరించారు. తల్లిపాల ప్రతిజ్ఞ చేయిస్తూ కార్యక్రమాన్ని ముగించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి..

పెద్దవడుగూరు: పుట్టిన బిడ్డకు తల్లి పాలు పట్టడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కండ్లగూడూరులో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల వలన పౌష్టికాహారం అందించడం జరుగుతోందన్నారు. బిడ్డలకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి రోగాలు రావని పేర్కొన్నారు. రొమ్ము క్యాన్సర్ రాకుండా నివారించవచ్చని తెలిపారు. చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందించే సదుపాయాలను వివరించారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లిలో బుధవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా వైద్యురాలు కీర్తన, అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజామణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. పుట్టిన పసి బిడ్డకు తల్లిపాలు (ముర్రుపాలు) తాగించాలన్నారు. ఇలా చేస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ముర్రుపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది దీనాకుమారి, లక్ష్మీనారాయణమ్మ, ఆయిషభాను, జాస్మిన్ బేగం, శమంతకమణి, శకుంతల, అంగన్వాడీ కార్యకర్త విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అత్యంత శ్రేష్టమైనవి

గుత్తి: తల్లిపాలు అత్యంత శ్రేష్టమైనవని సీడీపీఓ ఢిల్లీశ్వరి, సూపర్‌వైజర్ నాగేశ్వరి తెలిపారు. బుధవారం గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని జంగాల కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమా, శోభారాణి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి తల్లి తన బిడ్డలకు తప్పనిసరిగా చనుపాలు ఇవ్వాలన్నారు. తల్లి పాలలో పుష్కలంగా విటమిన్లు, ప్రోటీన్లు ఉంటాయని తెలిపారు. రోగ నిరోధక శక్తిని పెంచే ఔషధ గుణాలు కూడా ఉంటాయన్నారు. డబ్బా పాలు తాపించడం వల్ల బిడ్డల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. అంతే కాకుండా రోగ నిరోధక శక్తి పూర్తిగా క్షీణిస్తుందన్నారు.



యల్లనూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, అంగన్వాడీ కార్యకర్తలు



కల్లూరులో వైద్యాధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ



పెద్దపప్పూరు: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సాజితాబేగం

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం





మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, కేక్ కట్ చేస్తున్న సీపీఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం

తాడిపత్రి రూరల్: చేనేత రంగం మహిళా సాధికారతకు ఉపయోగపడుతోందని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో లక్షలాది మంది చేనేత రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారన్నారు. చేనేత చీరలకు దేశ, విదేశాల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. చేనేత పరిశ్రమపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

బుక్కరాయసముద్రం: ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తే మరింత ప్రతిభ కనబరుస్తారని జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బిల్‌కుష్ బేగం పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ చేనేత దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందన్నారు. నైపుణ్యాలను వెలికి తీస్తే మరింత రాణిస్తారని పేర్కొన్నారు. అనంతరం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రాఫ్ట్ బొమ్మల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, విజయలక్ష్మి, అనురాధ, చిదంబర్ రెడ్డి, మహమ్మద్ గౌస్, నాగరత్న, శోభ, ప్రసాద్, సుధాకర్, శ్రీదేవి పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాలి

పెద్దపప్పూరు: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి చింతాపురుషోత్తం, ఎమ్మార్పీస్ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఆదినారాయణ డిమాండ్ చేశారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని హరేరామ ఆశ్రమంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేనేతలకు 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నేతకార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. బుధవారం మిల్లు ఏరియాలో మగ్గాలు నేస్తున్న చేనేత కార్మికులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ మాట్లాడుతూ.. చేనేతల గొప్పతనాన్ని వివరించారు. చేనేతలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, బీజేపీ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి సురేష్, పద్మ, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తా



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి

యాడికి: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని దైవాల మడుగు, కేశవరాయుని పేట, లక్షుంపల్లె గ్రామాల్లో మండల స్థాయి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కేశరాయుని పేటలో ఎస్టీ, ఎస్సీ కాలనీలో నీటి సమస్య ఉందని గ్రామస్తులు తెలిపారు. అంగన్‌వాడీ, పొదుపు అనిమేటర్ పోస్టులు గతంలో విధులు నిర్వహించిన వారికే ఇవ్వాలని కోరారు. లక్షుంపల్లె గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే వాటిని త్వరలోనే పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అంతకుముందు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్ రెడ్డి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, ఎంఈఓ కాశెప్ప, మండల స్థాయి అధికారులు, నాయకులు రుద్రమనాయుడు, గోపాల్ రెడ్డి, రంగయ్య పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



ఈ-పంట నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఈరమ్మ

గార్లదిన్నె: మండలంలో వివిధ గ్రామాల్లో 2024 ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులంతా తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ ఈరమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా వేరుశనగ 1,746 ఎకరాలు, కంది 1,300 ఎకరాలు, ఆముదం 1,690 ఎకరాలు, పత్తి 133 ఎకరాల్లో సాగైనట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది పంటలు సాగు చేసిన రైతులు వంద శాతం పంట నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, భూమి పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా, 1బీ తీసుకుని ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ-పంట నమోదు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఏఎస్ఓ రాజ్యలక్ష్మి, సర్వేయర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

గార్లదిన్నె: వివిధ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు పరిష్కరించాలని దళిత సంఘం నాయకులు కోరారు. బుధవారం దళిత సంఘాల నాయకులు నూతన తహసీల్దార్ ఈరమ్మను కలసి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. రస్తా వివాదాలు, భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. స్పందించిన తహసీల్దార్ ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు తమ దృష్టికి వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు కుళ్లాయప్ప, నాగరాజు, ఓబులపతి, రామాంజనేయులు, మల్లికార్జున, పుల్లన్న, దేవా, రాము, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటన



మాట్లాడుతున్న గోవిందు

గుంతకల్లు: ప్రజా సమస్యల పరిశీలనకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గోవిందు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలో నెలకొన్న సమస్యలపై మున్సిపల్ కార్యాలయం వద్ద దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇక రాగులుపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుంచి గుంతకల్లు నియోజకవర్గంలోని చెరువులకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు ఇవ్వడానికి దాదపు రూ.50 కోట్ల అంచనాతో పిల్ల కాలవలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. అదేవిధంగా గుంతకల్లు మండంలోని ములకలపెంట నుంచి ఎక్కువ శాతం వలసకు వెళ్లినట్లు గుర్తించమన్నారు. ఈ విషయమై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ నేతృత్వంలో త్వరలో క్షేత్రస్థాయి పర్యటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యదర్శి రాముురాయల్, నాయకులు ఎస్ఎండీ గౌస్, రామాంజినేయులు, ఈశ్వరయ్య, ఉమర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వీరరాజు

యల్లనూరు: మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పనులు కల్పించాలని ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. రైతు పొలాల్లో చుట్టూ కంచెలాగా మొక్కలు నాటుకోవాలన్నారు. హార్టికల్చర్ రైతులు పండ్ల మొక్కలను కాపాడుకోవాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ కూలీలకు పనులు కల్పించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాలు పడుతుండటంతో మొక్కలు విరివిగా నాటాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ షబ్బీర్‌బాషా, ఈసీ బబ్లు, టెక్నికల్ అసిస్టెంట్ ప్రతాప్, శంకర్, జయరాం, శ్రీనివాసులు, అదిల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



యాడికి తహసీల్దార్ ప్రతాప్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న రెవెన్యూ సిబ్బంది

యాడికి: మండల తహసీల్దార్‌గా ప్రతాప్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఉరవకొండ, గుంతకల్లు మండలాల్లో తహసీల్దార్‌గా పని చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌గా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని వెల్లడంచారు. తహసీల్దార్ ప్రభాకర్ రెడ్డికి డీటీ బాలమ్మ, రీ సర్వే డీటీ రాజ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది శాలువా, పూలమాలలతో సన్మానించారు.

శింగనమల: మండల తహసీల్దార్‌గా బ్రహ్మయ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్వీ నారాయణ, సర్పంచ్ వెంకటరాముడు, నాయకులు దైవయత్నం, నాగర్జున, వీరాంజనేయులు, పెద్దన్న, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు



పుష్పాలంకరణలో అయ్యప్ప స్వామి

తాడిపత్రి అర్బన్: షిర్డీ సాయిబాబా ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా మణికంఠుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. చేశారు. భక్తుల శరణుఘోషతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. పెద్ద ఎత్తున తరలిచ్చిన భక్తులు అయ్యప్ప భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు.

10న జిల్లా జైలులో వేరుశనగ చెక్క వేలం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని జిల్లా జైలులో ఈనెల 10వ తేదీన 25,000 కేజీల వేరుశనగ చెక్కకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు జైలు సూపరింటిండెంట్ రెహమాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాట ప్రాంతీయ జైళ్ల ఉపశాఖ అధికారి కడప రేంజ్ వారి సమక్షంలో జరుగుతుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.22,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలం పాట ముగిసిన తరువాత డిపాజిట్ వెనక్కి చెల్లించడం జరుగుతుందన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గార్లదిన్నె: మండల పరిధిలోని కెకె తండాలో బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యాధికారి డాక్టర్ కే.ఎస్.రామ్‌కుమార్, గార్లదిన్నె ప్రభుత్వ యునాని వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ కలీమూన్ తదితరులు 85 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారామెడికల్ సిబ్బంది వెంకట సుబ్బయ్య, మహేంద్ర, సుధాకర్, రషీద్, కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేల కూలిన విద్యుత్ స్తంభం



ఈదురు గాలులకు నేలకూలిన విద్యుత్ స్తంభం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి విద్యుత్ స్తంభం నేలకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభం నేలకూలడంతో కోట వీధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బుధవారం విద్యుత్ సిబ్బంది కోట యువకులతో కలిసి కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: సమగ్ర సస్యరక్షణతోనే అధిక దిగుబడులు సాధ్యమని ఏడీఏ పద్మజ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని దంచర్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏడీఏ పద్మజ హాజరై రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. సస్యరక్షణలో భాగంగా వేరుశనగ పంటలో వేపనూనె పిచికారీ చేసుకోవాలని సూచించారు. కంచె పంటల సాగుతో పంటకు పురుగుల బెడద తగ్గుతుందన్నారు. అదేవిధంగా ఆకర్షక పంటల సాగు వల్ల ప్రధాన పంటపై పురుగు ప్రభావం తగ్గుతుందని పేర్కొన్నారు. అంతర పంటలు వేసుకోవడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో సైతం రైతులకు దిగుబడి వస్తుందన్నారు. జీవామృతం, కషాయం తయారీ, వాడుక, విత్తన శుద్ధి తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు.